క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 11వ తేదీన పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

76 మందికి ఆరోగ్య పరీక్షలు



చిన్నారుల నోటిని పరిశీలిస్తున్న వైద్యాధికారి ఫణికుమార్

భామిని: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తివ్వాకొండల్లో ఉన్న మణిగ, బొడ్డగూడ గిరిజన గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, దాదాపు 76 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ, ఇతర అనారోగ్య పరిస్థితులకు లోనుకాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి ఫణికుమార్ సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమ తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు కొండగొర్రి చంటి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక శాఖా గ్రంథాయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వీటిని సద్వినియోగం చేసుకుంటే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలెవరూ పక్కదారి పట్టకుండా, చదువుపైనే దృష్టి ఉంచేలా ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.సుకన్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం

బలిజిపేట: మండలంలోని బర్లి, మిర్తివలస, తుమరాడ గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా కొద్ది రోజుల నుంచి గ్రామంలో ఘటాలు తిరుగుతున్నాయి. ముఖ్యంగా సోమవారం పండగ, మంగళవారం సిరిమాను ఉత్సవం, బుధవారం అనుపు ఉత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. బర్లి, మిర్తివలసల్లో శ్రీశ్రీశ్రీ గజాలమ్మ తల్లి, బంగారమ్మ తల్లి ఉత్సవాన్ని, తుమరాడలో శ్రీశ్రీశ్రీ పాదాలమ్మ తల్లి, బురదాలమ్మ తల్లి, పురటాలమ్మ తల్లి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. మంగళవారం నిర్వహించనున్న సిరిమాను ఉత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు.

ఎనిమిది ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు

సీతానగరం: మండలంలోని రైతులు రబీవరి సాగుచేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 8 రైతుభరోసా కేంద్రాలను ఎంపిక చేసినట్లు ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఖరీఫ్ వరిసాగుకు ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా 4 ఆర్బీకేలకు వచ్చిన ఎరువులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 430 ఎకరాల్లో రైతులు రబీవరి సాగు చేసినట్లు తెలియజేశారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 8 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం రబీ వరిచేను పూత, వెన్ను పాలు పోసుకునే దశలో మడులలో ఉన్నందున కొనుగోలు కేంద్రాలు మంజూరు చేసినా ప్రారంభించడానికి సమయం పడుతుందన్నారు. వరినారు మళ్ల తయారుచేసినప్పటికీ 2023–24 ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేయనున్న రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందు జాగ్రత్తచర్యగా ఆర్బీకేల్లో నిల్వలుంచినట్లు తెలియజేశారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎరువులు విత్తనాలు భద్రపరిచామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియ జేశారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలి

సీతానగరం: విద్యాబోధనకు, విద్యార్థుల రాకపోకలకు అవసరమైన మౌలిక వసతులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పదోతరగతి ఉత్తీర్ణులైన పిల్లల్ని తల్లిదండ్రులు చేర్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు. ఈ మేరకు సోమ వారం సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక ఆధ్వర్యంలో అధ్యాపకులు టి రవికుమార్, వినోద్, కిశోర్, నవీన్‌ప్రసాద్, అచ్చింనాయుడులు తామరఖండి, చినభోగిలి, బగ్గందొరవలస గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా సదుపాయాలున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పిల్లలను చేర్పించాలని కోరుతూ ప్రచారం చేశారు.

సీఎం జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: సీఎం జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోడిశ గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వత్సరాయిగూడ, కురసడుగూడ, కొత్తగూడ, బొర్రవలస, కొంటికర్రగూడ, ఎర్రన్నగూడ ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పల్లెలు ప్రగతి పథంలో నడుస్తున్నాయన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన పంపిణీ చేస్తున్న పథకాల తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలతో పాటు సమావేశాలు, సభలు, సదస్సుల్లో ఇచ్చిన మరెన్నో హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలులోని సంక్షేమ పథకాలతో ప్రతిఇంటా సంక్షేమం నెలకొందన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఇలాంటి, ఇదే ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము, సింహాచలం, రమేష్, కృష్ణ, అబ్బాస్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి



స్పందన కార్యక్రమంలో ప్రజాసమస్యలు వింటున్న ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి

సీతంపేట: ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రజలు సమర్పించిన వినతులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒకసారి స్పందనలో వినిపించిన సమస్యల మరో రోజు జరిగే స్పందనలో వినిపించకూడదన్నారు. స్పందన సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ మురళి, పీఏఓ హరికృష్ణ, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏడీఈ తిరుమలరెడ్డి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

పాలకొండ: పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సోమవారం సమావేశమైన ఆయన భూముల రీసర్వేపై సమీక్షించారు. రైతుల సమక్షంలోనే సర్వే చేయాలని, సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు కూడా పక్కాగా జరపాలన్నారు. సర్వే సక్రమంగా జరిగితే రైతుల మధ్య ఎప్పుడూ తగాదాలు తలెత్తవన్నారు. సర్వే సిబ్బందికి కూడా రైతులు కూడా సహకరించాలని కోరారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

పాలకొండ: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు సూచించారు. సోమవారం ఆయన కార్యాలయంలో వార్డు సచివాలయాల సిబ్బందితో సమావేశమై, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా, నిర్మాణ దశలోని నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి శతశాతం నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించి, అమలు చేయాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: గ్రామదేవతల ఉత్సవాల నేపథ్యంలో దొంగతనాలు, మోసాలు జరిగే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ బి.శివప్రసాద్ సూచించారు. స్థానిక పాలకొండ–వీరఘట్టం రోడ్డులో సోమవారం వాహన తనిఖీలు చేపట్టిన ఆయన వాహనదారులకు పలు సూచనలు చేశారు. పండగలకు వచ్చే వారిలో సాధారణ జనంతో పాటు దొంగలు, దోపిడీదారులు కూడా ఉంటారని, చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

గ్రంథాలయానికి రూ.5వేలు వితరణ

బలిజిపేట: మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయానికి శాశ్వత వితరణగా వి.రాము రూ.5వేలను గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడుకు సోమవారం అందించారు. గ్రంథాలయం అభివృద్ధికి ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రాజేష్, ఆర్.శంకర్, ఎస్.రామకృష్ణ, సంజయ్‌దత్, రామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పరిశీలన

బలిజిపేట: మండలానికి మొదటి విడతగా వచ్చిన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా దీవెన కిట్లు భద్రపరుస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వచ్చిన బ్యాగులు, పుస్తకాలు, బూట్లు, అన్ని రకాల వస్తువులను ఉంచేందుకు ప్రత్యేక గదులను తీసుకున్నట్లు చెప్పారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొదటి విడతలో 13,563పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మొత్తం 40వేల పుస్తకాలు రావాల్సి ఉందని వచ్చిన పుస్తకాలను రోల్ ప్రకారం పంపిణీ చేస్తామని తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. సోమవారం మండలంలోని ఇటిక గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపకూ లబ్ధి జరుగుతోందన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా ప్రజలు కష్టాలు పడకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ అంకలాపు అనసూర్యమ్మ, ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, పార్టీ నాయకులు అల్లు ఈశ్వరరావు, మరడాన కిశోర్, పాడి పెదగ వరన్నదొర, వారాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి దోమల మందు పిచికారీ

సీతంపేట: ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా మండల వ్యాప్తంగా ఈ నెల 16వ తేదీ నుంచి దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు సోమవా రం వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో 16న పూతికవలస, బంజారుగూడ, పుట్టిగాం, రేగులగూడ, 17న తుంబకొండ, గాటిగుమ్మడ, కోసంగి, 18న కోపువలస, సంకిలిగూడ, పెద్దూరు, 19న ఐటీడీఏ క్వార్టర్స్, సీతంపేట, 23న కిల్లాడ, రూపాయి, దారపాడు, చెక్కాపురం, 25న పొల్ల, కొత్తవలస, 26న మల్లికాలనీ, వెంకటిగూడలో దోమల మందు స్ప్రేయింగ్ చేపడతామని పేర్కొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గరుగుబిల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: విద్యార్థులకు విజ్ఞానం అందించడమే ప్రధాన ధ్యేయంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన ఎన్నో రకాల పుస్తకాలు గ్రంథాలయంలో ఉంటాయని, వాటిని బాగా చదివి జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు కూడా వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆరుబయట తిరిగి చెడిపోకుండా, గ్రంథాలయానికి వచ్చి బాగు పడేలా ప్రోత్సహించాలన్నారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో పుస్తకాలు, కథలు చదివించడం, వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా మరికొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కురుపాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభించారు. లైబ్రేరియన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 11వ తేదీ వరకు దాదాపు 42 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడంతో పాటు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, పెయింటింగ్ వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం నిర్వహించారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలతో పాటు పుస్తక పఠనం, విజ్ఞానం పెంపొందించే విషయాలు తెలియజేయడం వంటివి చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జామి రవి, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు పాల్గొన్నారు.

భామిని: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో పుస్తకాలు, కథలు చదివించడం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, లైబ్రేరియన్ ఎ.సునీత తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ: పీహెచ్‌సీల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని మాదలింగి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)తో పాటు దళాయివలస, బిత్రపాడు గ్రామాల్లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను సోమవారం సదర్శించిన ఆయన అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అలాగే రికార్డులు, వార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ల్యాబ్‌ల వినియోగం, మందు నిల్వల గదిని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే వారికి అవసరమైన సేవలు సకాలంలో అందించి, వారి నమ్మకం చూరగొనాలన్నారు. రోజువారీ ఓపీ పెంచడంతో పాటు డెలివరీ అయిన గర్భిణుల వివరాలను ఎప్పటిప్పుడు హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి పి.శ్రీధర్, సూపర్‌వైజర్లు పార్వతి, జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో గర్భిణులకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దేవి, ఎన్ఎస్ఎం కుమారి ఆధ్వర్యంలో గర్భిణుల బరువు, ఆరోగ్యం చూసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకుని, మానసికంగా, శారీరకంగా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. అలాగేతేనే ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని తెలిపారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధాన్యాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొమరాడ: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుందని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.అన్నపూర్ణ, ఎం.అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గంగరాయివలస గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద నవధాన్యాల ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి వీటిని పంపిణీ చేస్తామన్నారు. ప్రతీ రైతు తొలకరి జల్లులు(వర్షం)కు ముందే వీటిని చల్లుకుని, నేలను సారవంతం చేసుకోవాలన్నారు. నేల బాగుంటేనే పంటలు బాగా పండుతాయన్నారు.

వారపుసంత శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోండి



అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానికంగా జరిగే వారపుసంత, సంత పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోండి అని ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి సూచించారు. సోమవారం స్థానిక వారపు సంతను పరిశీలించిన ఆమె సంబంధిత అధికారులతో సమావేశమై, సంతలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని తెలిపారు. ప్రతీ షాపు వద్ద డస్ట్‌బిన్ ఉండేలా చూడాలన్నారు. షాపులు బయట కాకుండా షెడ్డుల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యం, సెక్రటరీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



జెడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన 1998-99 బ్యాచ్ విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా సోమవారం కలుసుకున్నారు. దాదాపు పాతికేళ్ల తర్వాత వారంతా ఒకరినొకరు చూసుకోవడంతో పట్టరాని ఆనందంతో ఎంతో ఆప్యాయతా అనురాగాలతో పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం కాసేపు సరదాగా గడిపారు.

నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం



కొమరాడ: వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు



గరుగుబిల్లి: ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి



పాలకొండ: బెజ్జిలో వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

కొమరాడ: నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. సోమవారం మండలంలోని ఆర్తాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలోనే పనిచేయాలన్నారు. వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉండేలా చూడాలన్నారు.

గరుగుబిల్లి: వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించిన ఆమె ప్రతిఒక్కరికీ కనీస వేతనం అందేలా చూడాలన్నారు. పనులు జరిగిన వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ఉపాధి హామీ పనుల లక్ష్యాలు నెరవేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు సూచించారు. మండలంలోని పనుకువలస, అట్టలి, బెజ్జి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించిన ఆయన వేసవి నేపథ్యంలో వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఉండేలా చూడాలన్నారు.

నేడు పైడితల్లి సిరిమానోత్సవం

వీరఘట్టం: పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలో మంగళవారం సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇప్పటికే ఉత్సవానికి సంబంధించి, ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేశామన్నారు. సోమవారం అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.



ఉత్సవానికి సిరిమానును సిద్ధం చేస్తున్న దృశ్యం